# హ్యాట్రిక్ బరిలో గ్రేటర్ నేతలు

**మూడోసారి గెలిచేందుకు ఉత్సాహంగా ప్రచారం**

**భారీ ఓటింగ్‌తో ప్రత్యర్థులను ఓడించేందుకు సన్నాహాలు**

**బరిలో ఖైరతాబాద్ నుంచి దానం,**

**సనత్‌నగర్‌లో తలసాని, చాంద్రాయణగుట్ట నుంచి అక్బరుద్దీన్, కూకట్‌పల్లిలో మాధవరం, సికింద్రాబాద్ నుంచి పద్మారావు**

సిటీబ్యూరో, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో అడుగుపెట్టాలి అనేది ప్రతి రాజకీయ నాయకుడి లక్ష్యం. కనీసం ఒక్కసారైనా ప్రజా సేవ చేయాలని నేతల ఆకాంక్ష. కానీ, పదవి అందరికీ సాధ్యం కాదు. వచ్చినా అలా కొందరు నిలుపుకోలేరు. కానీ, గ్రేటర్లో ముగ్గురు నేతలు సరికొత్త పంథాలో గడిచిన 25 ఏళ్లుగా ప్రజా జీవితంలోనే ఉంటున్నారు. అలా ఇప్పటికే పలు పర్యాయాలు అసెంబ్లీ మెట్లను ఎక్కిన ఆ నేతలు మరోసారి ప్రజా క్షేత్రంలో గెలిచి హ్యాట్రిక్ దిశగా సాగుతున్నారు. తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి కొందరు బీఆర్ఎస్ తరఫున గెలుస్తుండగా, ఎంఐఎం నుంచి బరిలో ఉన్నారు.

**ప్రతికూల పరిస్థితుల ఎదుర్కొని..**

ప్రతికూల రాజకీయ పరిస్థితులను ఎదుర్కొని హ్యాట్రిక్ కొట్టేందుకు గ్రేటర్‌లోని నేతలు సిద్ధమయ్యారు. ఇప్పటికి ఐదు పర్యాయాలు ప్రజాక్షేత్రంలో గెలిచి విజయాలను దక్కించుకోగా, పలు దఫాలుగా అసెంబ్లీ రణరంగంలో నిలుచున్నారు. వరుసగా 30 ఏళ్లుగా ప్రజా ప్రతినిధులుగా గెలిచిన నేతలకు మరో కొత్త రికార్డ్‌లను సొంతం చేసుకోనున్నారు. పార్టీలు మారినా నియోజకవర్గాలు మారినా ఎన్నికల క్షేత్రంలో ప్రజా ప్రతినిధిగానే కొనసాగుతున్నారు. అందులో, ఖైరతాబాద్ నుంచి బరిలో ఉన్న దానం నాగేందర్ ఒకరు. కాగా, సనత్ నగర్ నుంచి తలసాని శ్రీనివాస్ యాదవ్, చాంద్రాయణ గుట్ట నుంచి అక్బరుద్దీన్ ఓవైసీ, సికింద్రాబాద్ నుంచి పద్మారావు గౌడ్, కూకట్‌పల్లిలో మాధవరం కృష్ణారావు, కుత్బుల్లాపూర్ నుంచి కేపీ వివేకానంద గౌడ్ ఉన్నారు.







**బీఆర్ఎస్ నుంచి ఐదు గురు ఎమ్మెల్యేలు...**

1986లో రాజకీయ ఆరంగేట్రం చేసిన తలసాని శ్రీనివాస్ యాదవ్ తొలి సారి 1994లో సికింద్రాబాద్ నుంచి ఎమ్మెల్యేగా ఎంపికయ్యారు. ఆ తర్వాత 2004లో పోటీచేసి ఓడినా, 2008 ఉప ఎన్నికల్లో గెలిచి, ఆ తర్వాత 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లో జరిగిన ఓడినా, తెలంగాణ ఏర్పాటైన తర్వాత 2014 నుంచి వరుస విజయాలతో ప్రజా నాయకుడిగా కొనసాగుతున్నారు. గ్రేటర్ ముఖ్య నేతల్లో ఒకరిగా, సినిమాటోగ్రఫీ, యానిమల్ హస్బెండరీ శాఖ మంత్రిగా సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం మూడోసారి సనత్ నగర్ నుంచి బరిలో ఉన్నారు. ఇక ఇన్నాళ్లు డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించిన సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ మలి దశ తెలంగాణ ఉద్యమకారుడి స్థాయి బీఆర్ఎస్‌లో ఎదిగారు. తెలంగాణ ఏర్పాటు అయిన తర్వాత 2014 ఎన్నికల్లో 49 శాతం ఓట్లతో, 2018లో 69 శాతం ఓట్లతో గెలిచారు. తాజాగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచేందుకు ఉత్సాహంగా ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఖైరతాబాద్ నుంచి బరిలో ఉన్న దానం నాగేందర్ ఇప్పటివరకు ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఒకసారి మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 1994లో తొలిసారి ఆసిఫ్ నగర్ నుంచి పోటీచేసి గెలుస్తూనే ఉన్నారు. 1999, 2004లో వరుసగా గెలిచి హ్యాట్రిక్ కొట్టగా, ఆ తర్వాత 2018లో గెలిచి, ఐదోసారి ఖైరతాబాద్ నుంచి గెలిచి రికార్డ్ కొట్టేందుకు సిద్ధమయ్యారు. అలాగే, తెలంగాణ ఏర్పాటు అయినా తర్వాత కూకట్‌పల్లి నుంచి పోటీ చేసిన తొలి రెండు ఎన్నికల్లో గెలిచిన మాదవరం కృష్ణారావు ఈ దఫా గెలుపుతో హ్యాట్రిక్ కొట్టనున్నారు. కుత్బుల్లాపూర్ నుంచి బరిలో నిలిచిన కేపీ వివేకానంద గౌడ్ కూడా మాదవరం తరహాలోనే గెలిచి హ్యాట్రిక్ విజయం కోసం ఉవ్విళ్లూరుతున్నారు. చాంద్రాయణ గుట్ట నుంచి బరిలో ఉన్న అక్బరుద్దీన్ ఓవైసీ ఇప్పటివరకు ఐదుసార్లు వరుసగా ఎంఐఎం పార్టీ నుంచి గెలవగా, ఈ దఫా గెలిచి ఆరో విజయంతో డబుల్ హ్యాట్రిక్ సాధించిన నేతగా గ్రేటర్‌లో నిలువనున్నారు.

# బీఆర్ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

**మంత్రి చామకూర మల్లారెడ్డి**

**శామీర్‌పేటలో బీఆర్ఎస్ ఆశీర్వాద సభ**



గొర్రెపిల్ల, గొంగడితో మంత్రికి సన్మానం



శామీర్‌పేటలో బీఆర్ఎస్ ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

శామీర్‌పేట, నవంబర్ 15 : రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించిందంటే బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శామీర్‌పేటలో బుధవారం మేడ్చల్ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి చామకూర మల్లారెడ్డి ఆశీర్వాద సభ నిర్వహించారు. సభలో గొల్లకురుమ, వడ్డెర, యాదవ, గౌడ సంఘాలు పెద్ద ఎత్తున సభకు హాజరై మంత్రిని సన్మానించారు. ముందుగా వివిధ పార్టీల నుంచి కార్యకర్తలకు గులాబీ కండువాకప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశానికే ఆదర్శం అన్నారు. గోదావరి, కృష్ణ జలాలతో తెలంగాణ ప్రాంతానికి తాగునీరు, సాగునీటిని అందించిన మహనీయుడు సీఎం కేసీఆర్ అన్నారు. మిషన్ భగీరథ పథకం ఎంత గొప్పదో ఒక్కసారి మహిళలు అడిగితే తెలుస్తుందన్నారు. ఆడపిల్లలకు మేనమామలాగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్లు, రైతన్నకు వెన్నుదన్నుగా రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు ఎన్నో కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నాయన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలోని 5 మండలాలు, 3 కార్పొరేషన్లు, 7 మున్సిపాలిటీల ఏర్పాటు చేసి పరిపాలన సౌలభ్యాన్ని పెంచారన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో 125 ఆలయాలు నిర్మించినట్లు, కుల సంఘాల బలోపేతానికి కృషి చేసినట్లు వివరించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో అభివృద్ధిని గుర్తించి కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుదర్శన్, సర్పంచ్ బాలమణి, ఎంపీపీ ఎల్లూభాయి బాబు, ఉపసర్పంచ్ రమేశ్‌యాదవ్, సొసైటీ వైస్ చైర్మన్ ఐలయ్యయాదవ్, డైరెక్టర్లు మాధవి, విజయలక్ష్మి, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, మేడి రవి, లాలయ్య, సోనీ, అఫ్జల్‌ఖాన్, వెంకట్‌రెడ్డి, మురళి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

# కంప్యూటర్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ, నవంబర్ 15: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత గల నేషనల్ కంప్యూటింగ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సుల్లో తెలంగాణ వ్యాప్తంగా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతున్నట్లు నేషనల్ కంప్యూటింగ్ కౌన్సిల్ సంస్థ డైరెక్టర్ సాయి వెంకట్ తెలిపారు. బుధవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ ట్రైనింగ్ కోర్సు, ఎథికల్ హాకింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్, పీజీ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ అకౌంటెన్సీ, కంప్యూటర్ టైపింగ్, టాలీ, డెటా ఎంట్రీ, టాలీ కోర్సులతో పాటు 50కి పైగా కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల యువతి, యువకులు ఈ నెల 23వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వివరాలకు 9505800047, www.pacecomputers.org లో సంప్రదించవచ్చని కోరారు.



మూసాపేటలో బుధవారం జరిగిన రోడ్ షోలో ఎమ్మెల్యే కృష్ణారావుకు గజమాలతో స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

# రెట్టింపు మెజారిటీయే లక్ష్యం

**జోరుగా బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రచారం**

**ఇంటింటి ప్రచారంతో ప్రజలకు చేరువ**

**బీఆర్ఎస్ అభ్యర్థులకు పెరుగుతున్న మద్దతు**

మేడ్చల్, నవంబర్15 (నమస్తే తెలంగాణ): గత అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన మెజార్టీని మించేలా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తున్నారు. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల అభ్యర్థులు మంత్రి మల్లారెడ్డి, కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డిలు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ప్రజల మద్దతు కూడగట్టుకుంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని ఐదు స్థానాలను బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకున్న విషయం విధితమే. దీంతో తిరిగి ఐదు స్థానాలను గెలుపొందేలా అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తొమ్మిదిన్నరేండ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థులకు ప్రజల నుంచి స్వచ్ఛందంగా మద్దతు లభిస్తున్నది. గత ఎన్నికల్లో మంత్రి మల్లారెడ్డి మేడ్చల్ నియోజకవర్గంలో సమీప కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్ఆర్‌పై 88,369 మెజార్టీతో విజయం సాధించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమీప టీడీపీ, కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థి నందమూరి సుహాసినిపై 41,049 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సమీప కాంగ్రెస్ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌పై 41,500 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఇదే జోష్‌లో ప్రస్తుత ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన పథకాలన్నీ ప్రజలకు మరింత మేలు చేసే విధంగా ఉండటంతో బీఆర్ఎస్‌కే ప్రజలు జై కొడుతున్నారు. ఈ ఎన్నికల్లో రెట్టింపు మెజార్టీని ప్రజలు అందిస్తారని బీఆర్ఎస్ అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్

# బీఆర్ఎస్‌ను మరోసారి గెలిపించండి

**మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**

బంజారాహిల్స్, నవంబర్ 15 : హైదరాబాద్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కోరారు. ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి బుధవారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేబీఆర్ పార్కులోని వాకర్లను కలిసి బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను అందజేశారు. హైదరాబాద్ సాధిస్తున్న పురోగతిని పూర్తిగా పరిశీలన చేసి ఓటు హక్కును వినియోగించుకోవాలని ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దానం నాగేందర్ కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాంచందర్, మహిళా విభాగం అధ్యక్షురాలు మాధవి తదితరులు పాల్గొన్నారు.